

ఇవిఎంల గొడౌన్ వద్ద పటిష్ట భద్రత

గొడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాకు సంబంధించిన ఇవిఎంలను భద్రపర్చిన గొడౌన్ వద్ద నిరంతరం పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా స్థానిక కలెక్టరేట్‌లోని ఇవిఎం గొడౌన్‌ను గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గొడౌన్‌లో భద్రపర్చిన ఇవిఎం బియులు, సియులు, వివిప్యాట్‌లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఎన్.భరతరావు (వైఎస్‌ఆర్), అచ్యుత్ (టిడిపి), నెరుసు నెలరాజు (బిజెపి), కలెక్టరేట్ ఎన్నికల విభాగ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులంటే పట్టదా..!

ఎన్నికల్లో పోలీస్ సిబ్బందికి ఇచ్చిన హామీలు బుట్టదాఖలు

సరెండర్ లీవ్స్, టిఎ, డిఎ, వీక్లీఆఫ్ ఏ ఒక్కటీ అమలు కాని పరిస్థితి

అప్పుడు వైసిపి, ఇప్పుడు కూటమి హయాంలో పోలీసులకు వంచన

సిఎం క్యాంప్ ఆఫీసు టర్మ్ విధులతో నరక యాతన

రెండు జిల్లాల్లో దాదాపు 3,500 మందికిపైగా సిబ్బంది అవస్థలు

'పోలీసులంటే పాలకులకు పట్టదు.. పోలీసులను అన్ని విధాలుగా వాడుకోవడమే తప్ప తమ కష్టాలను మాత్రం పట్టించుకోరు' అంటూ ఆ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులంతా తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అప్పుడు వైసిపి ప్రభుత్వం.. ఇప్పుడు కూటమి సర్కార్ ఏ ప్రభుత్వం వచ్చినా ఇదే పరిస్థితి అని వాపోతున్నారు. తాను పోలీస్ అధికారి కొడుకునని, పోలీసుల కష్టాలు తీరుస్తానని చెప్పిన పవన్‌కల్యాణ్ సైతం అధికారంలోకొచ్చాక ఆ మాటలను మరిచిపోవడం అందరినీ తీవ్రంగా కలిచివేస్తోంది. కూటమి నేతలు ఎన్నికల్లో పోలీస్ సిబ్బందికి ఇచ్చిన హామీలు మరిచిపోవడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. దీంతో జిల్లాలోని వేలాది మంది పోలీస్ సిబ్బంది తమగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు పోలీస్ సిబ్బందికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆ శాఖలో పని చేస్తున్న వారంతా కోరుతున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎండనక, వాననక.. రాత్రనక, పగలనక సమయంతో సంబంధం లేకుండా పని చేసే పోలీస్ సిబ్బంది కష్టాలను ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. గత వైసిపి ప్రభుత్వం పోలీసులను ప్రయివేటు సైన్యంలా వాడుకున్నప్పటికీ నిబంధనల ప్రకారం వారికి ఇవ్వాల్సినవి కూడా సక్రమంగా ఇవ్వలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. తాము అధికారంలోకి వస్తే పోలీసుల సమస్యలు పరిష్కరిస్తామంటూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ గడిచిన ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. దీంతో తమకు మంచిరోజులు వచ్చాయంటూ పోలీస్ సిబ్బంది కూటమికి ఎన్నికల్లో జైకొట్టారు. అఖండ మెజార్టీతో గెలుపొందిన టిడిపి కూటమి అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకూ పోలీసులకు ఇచ్చిన ఏఒక్క హామీనీ అమలు చేయని పరిస్థితి ఉంది. కనీసం ఎప్పుడు అమలు చేస్తారో కూడా చెప్పడం లేదు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీసులకు ఇచ్చిన హామీలను కొన్నయినా అమలు పరుస్తారని పోలీస్ సిబ్బంది భావించినప్పటికీ నిరాశే మిగిలింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కానిస్టేబుల్ నుంచి ఎఎస్‌ఐ స్థాయి ఉద్యోగులు దాదాపు 3,500 మంది వరకూ ఉన్నారు. సిఐ, ఎస్‌ఐలు మరో 200 మంది వరకూ ఉండొచ్చు. పోలీస్ ఉద్యోగులకు సరెండర్ లీవ్స్ పేరుతో ఏడాదికి 45 రోజులు వేతనం ప్రభుత్వం ఇస్తోంది. ఈ వేతనం మూడుసార్లుగా జనవరి, జులై, నవంబర్ నెలల్లో జమ చేయాల్సి ఉంది. తక్కువ అనుభవం ఉన్న కానిస్టేబుల్‌కు రూ.70 వేలు, సీనియర్లకు రూ.లక్షన్నర వరకూ సరెండర్ లీవ్స్ బకాయిలు రావాల్సి ఉంది. మూడు విడతల సరెండర్ లీవ్స్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ఈ సొమ్ముతోనే పోలీసులు తమ పిల్లలకు స్కూల్ ఫీజులు వంటివి కట్టుకునేవారు. అదేవిధంగా క్రిస్మస్, సంక్రాంతి పండుగలు జరుపుకునేవారు. గత వైసిపి ప్రభుత్వం సైతం సరెండర్ లీవుల సొమ్ము సక్రమంగా ఇవ్వకుండా తీవ్ర ఇబ్బంది పెట్టింది. పోలీసులకు ప్రతినెలా టిఎ (ట్రావెలింగ్ అలవెన్స్) ఇస్తారు. ఇది ఉద్యోగి కేడర్‌ను బట్టి రూ.2,250 నుంచి రూ.4,500 వరకూ ఉంది. గడిచిన 15 నెలలుగా టిఎ బకాయిలు చెల్లించలేదు. ఒక్కో ఉద్యోగికి తక్కువగా లెక్కించినా రూ.33 వేలకుపైగా సొమ్ము రావాల్సి ఉంది. దీనిలో సగం సొమ్ము ముందుగా ఇచ్చినా పోలీస్ సిబ్బందికి ఎంతోకొంత ఊరట కలిగేది. అదీ లేకుండాపోయింది. గత ప్రభుత్వం పోలీస్ సిబ్బందికి వారాంతపు సెలవు పేరుతో తెగ హడావుడి చేసింది. నెల, రెండు నెలలు అమలు చేసి చేతులెత్తేసింది. తాము అధికారంలోకి వస్తే పోలీస్ సిబ్బందికి వారాంతపు సెలవు (వీక్లీఆఫ్) అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇది అమలుకాని పరిస్థితి నెలకొంది.

టర్మ్ డ్యూటీలతో నరకం..

ప్రతి జిల్లా నుంచి పోలీస్ సిబ్బందికి సిఎం క్యాంప్ ఆఫీస్ వద్ద టర్మ్ డ్యూటీలు వేస్తున్నారు. సర్కిల్ పరిధిలో పది నుంచి 12 మంది వరకూ సిబ్బంది టర్మ్ డ్యూటీలకు వెళ్తుంటారు. ఈ డ్యూటీ 15 రోజులు చేయాల్సి ఉంటుంది. టర్మ్ డ్యూటీకి వెళ్తున్న పోలీసులకు అక్కడ ఎటువంటి వసతులూ ఉండవు. తినడానికి తిండిగానీ, ఉండడానికి చోటుగానీ ఏ ఒక్కటీ ఉండని పరిస్థితి. డార్మెటరీలో ఉండాలన్నా రోజుకు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. భోజనం, ఇతర ఖర్చుల కింద రూ.300 వరకూ అవుతోంది. రోజుకు కనీసంగా రూ.500 వరకూ ఖర్చవుతోంది. ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుంది. టర్మ్ డ్యూటీలు రద్దు చేయాలని పోలీస్ సిబ్బంది ఎప్పటి నుంచో కోరుతున్నారు. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వంలోనైనా తమ సమస్య తీరుతుందని పోలీసులు భావించినా విముక్తి లేకుండాపోయింది. సిఎం క్యాంప్ ఆఫీసు టర్మ్ డ్యూటీలను వెంటనే ఆపేయాలని సిబ్బంది కోరుతున్నారు. పోలీసులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోగా, నిబద్ధతతో పనిచేయాలని మాత్రం పాలకులు ప్రసంగాలు ఇస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆయువు తీసిన అప్పులు..!

పొగాకుకు తెగులుతో ఆందోళన


అప్పులు తీర్చేదెట్టాగని భయంతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఇద్దరు కుమార్తెలు.. వారిని బాగా చదివించాలనేది ఆ దంపతుల ఆశ. దానికోసం సొంత పొలం రెండెకరాలకు తోడు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేశాడు.. అయితే ఇంతలోనే పొగాకుకు తెగులు సోకింది. దీంతో పంట దెబ్బతింది. అంతే ఆ రైతు తీవ్ర ఆవేదనకు గుర య్యాడు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలి.. కుటుంబ పోషణ ఎలాగని మదనపడ్డాడు. అప్పులు తీర్చే మార్గం కన్పించకపోవడంతో తనువు చాలించాలని పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వీరభద్రవరంలో ఈ నెల 18న చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరభద్రవరానికి చెందిన మామిళ్ల సూర్యచంద్రరావు (38) సొంత పొలం రెండు ఎకరాల్లో, కౌలుకు నాలుగు ఎకరాల్లో పొగాకు సాగు చేశాడు. పెట్టుబడి కోసం ప్రయివేట్ అప్పులు తీసుకున్నాడు. పంటకు తెగులు రావడంతో సూర్యచంద్రరావు మనస్తాపానికి గురై ఈ నెల 18వ తేదీన ఇంటి వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం గమనించిన సూర్యచంద్రరావు భార్య నాగలక్ష్మి ఆయనను జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. సూర్యచంద్రరావుకు మొత్తంగా సుమారు రూ.15 లక్షల ప్రయివేట్ అప్పు ఉందని స్థానికులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ప్రజాసంఘాలు, సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు



జంగారెడ్డిగూడెం : నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యాన గురువారం నిరసన తెలిపారు. పట్టణంలోని ఎస్‌సి పేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు అధ్యక్షత వహించగా, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతం పేరుతో రాజకీయాలు చేస్తూ దళితులను అవమాన పరుస్తోందని విమర్శించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తీసేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇప్పటికే కుట్రలు చేస్తుందని, దీన్ని ఐక్యంగా అంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బొడ్డు రాంబాబు, ఎస్‌కె.మాబు సుభాని, వంగా గోపి, బొడ్డు యశ్వంత్, పి.మణి పాల్గొన్నారు.

టి.నర్సాపురం: పార్లమెంటులో అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షాను తక్షణం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు. అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత బాధాకరమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేత అనుమోలు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన గురువారం ఆందోళనలు చేపట్టారు. సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నాగిరిపల్లి, తోటపల్లి గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో నేతలు జె.అంజయ్య, టి.అర్జునరావు, జె.శౌరి, జె.రంగారావు, సుబ్బారావు, యు.ప్రభాకరరావు, పి.కమలమ్మ పాల్గొన్నారు.

కలిదిండి : అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ కలిదిండి ప్రధాన సెంటర్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు, ప్రజాసంఘాల నాయకులు ప్రకాష్, శ్రీకాంత్, మాధవ, రామనాగేంద్రం, జ్ఞానేష్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ఖాజావలీ, ఖాసీంబాబు పాల్గొన్నారు.



ఏలూరు అర్బన్ : నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ ఆధ్వర్యాన...

ఏలూరు అర్బన్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక వసంత మహల్ సెంటర్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజనాల మాట్లాడుతూ ఇంటర్నేషనల్ డాన్‌గా చెప్పబడుతున్న అమిత్‌షాకు మన రాజ్యాంగం పట్ల, దళితుల పట్ల ఏమాత్రం గౌరవం ఉందో ఈ వ్యాఖ్యలను బట్టి తెలుస్తోందన్నారు. తక్షణం అమిత్‌షా తన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని, ఆయనను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు గౌడు రంగబాబు, దండుబోయిన చంద్రశేఖర్, చెక్క గుప్తా, లంక రామ్మోహన్, ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు ఉపసంహరించండి



విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల పెంపుతో జనం ఆందోళన చెందుతున్నారు.. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ఇప్పుడు పరోక్ష రూపంలో ఛార్జీలు మోపడం అన్యాయమని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో వినియోగించిన విద్యుత్‌కు మళ్లీ బిల్లులు చెల్లించాలనడం దారుణమని విమర్శిస్తున్నారు. తక్షణం భారాలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై పలువురి మనోగతం.. ప్రజాశక్తి - యంత్రాంగం

ఎస్‌సి, ఎస్‌టిలకు పెనుభారం.. ★★★

మిర్యాల దిలీప్, చింతలపూడి



వైసిపి ప్రభుత్వ హయాంలో జగన్మోహన్‌రెడ్డి ఐదుసార్లు కరెంట్ ఛార్జీలు పెంచారు. ప్రతిసారీ 50 పైసల్లోపే పెంచారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కరెంటు ఛార్జీ రూపాయిన్నర పెంచి వినియోగదారుల నడ్డి విరిచారు. ఈ ఛార్జీల పెంపు ఎస్‌సి, ఎస్‌టిలకు పెనుభారంగా మారనుంది.

విద్యుత్ భారాలు ఉపసంహరించాలి.. ★★★

ఎల్‌ఎస్.భాస్కర్‌రావు, సామాజిక కార్యకర్త, మండవల్లి



గతంలో వాడిన కరెంటుకు ఇప్పుడు ట్రూఅప్ ఛార్జీ పేరుతో ఇప్పుడు వసూళ్లు చేయడం ఎంతవరకూ సమంజసం. విద్యుత్ ఛార్జీల భారంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. సర్దుబాటు ఛార్జీలు నిలిపివేయాలి. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి. గత ప్రభుత్వం పెంచిన ఛార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి అది విస్మరించడమే కాక అదనపు భారాలు మోపడం బాధాకరం. తక్షణం ఆ భారాలను ఉపసంహరించాలి.

పేదలపై పెనుభారం.. ★★★

బివిఎస్.సాగర్, అరసం రాష్ట్ర కార్యదర్శి, టి.నర్సాపురం



గతంలో వినియోగించిన విద్యుత్‌కు మళ్లీ బిల్లులు చెల్లించాలనడం దారుణం. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న తరుణంలో విద్యుత్ ఛార్జీల భారం పేదలు భరించలేనిది. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలి. వెంటనే విద్యుత్ భారాలను ఉపసంహరించాలి.

ఎన్నికల హామీలకు విరుద్ధంగా భారాలు.. ★★★

రామకుర్తి నాగేశ్వరరావు, భీమడోలు



కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాల అంశంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకు విరుద్ధంగా వ్యవహరించడం దారుణం. గతంలో నా ఇంటికి రూ.వెయ్యి వరకు విద్యుత్ బిల్లు వచ్చేది. ప్రస్తుతం మరో సగం పెరిగింది. వాణిజ్యంతో పాటు, ప్రత్యేక కేటగిరీల కింద వసూలు చేసే బిల్లుల పెంపు విషయంలో కూడా స్పష్టత లేదు. జనవరి నుంచి బిల్లులు నూతన టారిఫ్ ప్రకారం వసూలు చేస్తాననడం సరికాదు. సోలార్ విద్యుత్ వాడకాన్ని ప్రోత్సహిస్తామని చెప్పిన ప్రభుత్వం దానికి అయ్యే ఖర్చు సామాన్యులకు అందుబాటులో లేకుండా చేసింది. ఏదేమైనా పెంచిన భారాలను ఉపసంహరించాలి.

సామాన్యులపై అదనపు భారం.. ★★★

బివిఎన్.మల్లేశ్వరి, నారాయణపురం, ఉంగుటూరు మండలం



ప్రభుత్వాలు మారినా సామాన్య ప్రజానీకంపై భారాలు తగ్గడం లేదు. విద్యుత్ బిల్లుల్లో ట్రూఅప్, సర్దుబాటు అంటూ అదనంగా ఛార్జీలు వచ్చి చేరాయి. విద్యుత్ వినియోగించిన దానికి ఎలాగూ ఛార్జీ వసూలు చేస్తున్నప్పుడు మళ్లీ ఈ సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల భారం వేయడం అన్యాయం. అన్ని ఖర్చులూ పెరిగిపోతూ కుటుంబాన్ని సాకడం చాలా కష్టంగా ఉంటోంది. దీనికితోడు విద్యుత్ బిల్లుల భారం మరింత ఆర్థిక భారం కానుంది. ప్రభుత్వం పునరాలోచించి పేదలకు సర్దుబాటు ఛార్జీల మోత నుంచి ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

ఎన్నికల హామీ అమలు చేయాలి.. ★★★

మల్లాది రత్నాకర్, నూజివీడు



నేను టైలరింగ్ చేసుకుని జీవిస్తున్నాను. ట్రూఅప్ ఛార్జీల భారం ఎక్కువగా ఉంది. ఇప్పటికే రెడీమేడ్ దుస్తుల వల్ల టైలర్ల పరిస్థితి అధ్వానంగా మారింది. గత ఎన్నికల సందర్భంగా విద్యుత్ ఛార్జీల పెంచబోనని హామీ ఇచ్చిన కూటమి ఇప్పుడు పరోక్ష రూపంలో ఛార్జీలు మోపడం అన్యాయం. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఛార్జీల భారాన్ని ఉపసంహరించాలి.

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి.. ★★★

బసవ కోటిలింగం, గాజుల వ్యాపారి, ఆగిరిపల్లి



నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ భారాలు మోపడం దారుణం. ట్రూఅప్ ఛార్జీలు, అదనపు ఛార్జీల పేరిట బాదుడు తగదు. విజిలెన్స్ దాడుల పేరుతో అధిక లోడుల కింద వేలాది రూపాయల విద్యుత్ బిల్లులను వినియోగదారులకు పంపడంతో వినియోగదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొత్తగా ఇప్పుడు వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్‌మీటర్లు (అదానీ) బిగించడం ఎంతవరకు సమంజసం. తక్షణం విద్యుత్ భారాలు ఉపసంహరించి స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి.

విద్యుత్ భారాలు ఉపసంహరించాలని సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం



ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ భారాలను వెంటనే ఉపసంహరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక సెంటర్‌లో గురువారం విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు తెలుగుదేశం పార్టీ బాదుడే బాదుడు అని ఆందోళనలు చేసిందన్నారు. మరి కూటమి ప్రభుత్వం ఇప్పుడు చేస్తుందేమిటని ప్రశ్నించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని కూటమి ఇచ్చిన హామీని సైతం తుంగలో తొక్కిందని విమర్శించారు. తక్షణం పెంచిన విద్యుత్ భారాలను తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.శివకుమార్, సిహెచ్.మరి డియ్య, కె.సీతారాముడు, సిహెచ్.సత్యనారాయణ, ఎ.నాగరాజు, వీర్రాజు, దుర్గారావు, సుబ్రహ్మణ్యం, సురేష్, రమేష్, పాండు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అశ్లీల నృత్యాల ఘటనలో 22 మంది అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిడమర్రు మండలం క్రొవ్విడిలోని అశ్లీల నృత్యాల ఘటనపై కేసు నమోదు చేసి 22 మందిని గురువారం అరెస్టు చేసినట్లు గణపవరం సిఐ సుభాష్ తెలిపారు. ఈ నెల 12వ తేదీన క్రొవ్విడి జనసేన గ్రామాధ్యక్షుడు వాకమూడి ఇంద్రకుమార్ తన పుట్టినరోజు పేరుతో స్థానిక రైస్‌మిల్లులో పార్టీ చేసుకున్నారు. ఈ సందర్భంగా భీమవరం నుంచి ఇద్దరు హిజ్రాలను తీసుకొచ్చి నగ్నంగా నృత్యాలు చేయించిన వీడియోలు బుధవారం వెలుగులోకి వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే చర్యలకు దిగారు. మొత్తం ఆ ఘటనలో పాల్గొన్న 20 మందికిపైన, ఇద్దరు హిజ్రాలపైనా కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఇప్పటికే ఈ ఘటనపై స్పందించిన జనసేన నాయకత్వం ఇంద్రకుమార్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. గత ప్రభుత్వ హయాంలో పెదపాడు, పాలకోడేరు మండలాల్లో ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు స్థానిక పోలీస్ అధికారులపైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ఈ ఘటనలో పోలీస్ అధికారులపై ఏమైనా చర్యలు తీసుకుంటారా అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

గ్రామీణులకు నాణ్యమైన వైద్యం అందించాలి

జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారి డాక్టర్ పర్వీన్ సుల్తానా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



వైద్య సిబ్బందితో డాక్టర్ పర్వీన్ సుల్తానా

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారిణి డాక్టర్ పర్వీన్ సుల్తానా వైద్య సిబ్బందిని ఆదేశించారు. జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఫార్మసీ, ల్యాబ్, ఒపి స్టాక్ రిజిస్టర్, రోగుల వార్డులను, డెంగీ, మలేరియా, వ్యాధి నిరోధక టీకాల కిట్లను పరిశీలించారు. ఆసుపత్రిలో గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించే వైద్యసేవలపై సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమెతో పాటు అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నరేంద్ర జోషి, జిల్లా సర్వ్ లెన్స్ అధికారి నరేంద్ర, ఎఎంఒ శ్రీను, జిల్లా టిబి యూనిట్ అధికారి రఘు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒసురేష్, వైద్యాధికార్లు గాయత్రి, మణికంఠేశ్వర్,పి హెచ్ సి సిబ్బంది పాల్గొన్నారు..

భీమడోలులో రబీ సాగు పనులు ప్రారంభం

620 ఎకరాల విస్తీర్ణంలో నారుమళ్లు

టార్పాలిన్లు సిద్ధం : వ్యవసాయాధికారి ఉషారాణి

ప్రజాశక్తి - భీమడోలు



నారుమళ్ల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మండలంలో రబీ (దాళ్వా) సాగు పనులు ప్రారంభమయ్యాయి. మండలంలో పూర్తిస్థాయి విస్తీర్ణంలో పనులు చేపట్టేందుకు రైతులు సిద్ధమయ్యారు. సుమారు 13,100 ఎకరాల విస్తీర్ణంలో సాగు జరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. దీనికోసం 620 ఎకరాల విస్తీర్ణంలో నారుమళ్లను వేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 310 ఎకరాల విస్తీర్ణంలో వేసినట్లు వ్యవసాయాధికారి ఉషారాణి తెలిపారు. అధికశాతం రైతులు పంజాబ్ రకమైన పిఆర్ 126, ఎంటియు 1121 సాగు చేస్తున్నారన్నారు. ఇక గత సీజన్‌కు చెందిన ధాన్యం సేకరణ విషయానికొస్తే 31 వేల టన్నుల ధాన్యం దిగుబడిని అంచనా వేయగా, రైతు సేవా కేంద్రాల ద్వారా 21 వేల టన్నుల వరకు ధాన్యం సేకరణ జరిగిందన్నారు. కొంతభాగం ప్రయివేట్ వ్యాపారులు కొనుగోలు చేశారన్నారు. ఇంకాను గత సీజన్‌కు చెందిన 200 టన్నుల వరకు ధాన్యం సేకరణ పూర్తి కావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున ధాన్యం రక్షణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామని తెలిపారు. వారి అవసరాలకు టార్పల్లిన్లను సిద్ధం చేశామన్నారు. మండలంలోని కొన్ని ప్రాంతాల్లో వరి ఊడ్పులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఇప్పటివరకు 54 ఎకరాల విస్తీర్ణంలో నాట్లు వేసే కార్యక్రమం పూర్తయిందని, ఈ నెలాఖరుకు ఆ కార్యక్రమం ముమ్మరమయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారి తెలిపారు. రైతులకు సాగు విషయమై ఏమైనా సందేహాలు వస్తే తనను సంప్రదించాలని కోరారు. పంట నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కూరగాయలు అధిక ధరకు విక్రయిస్తే ఉపేక్షించం

ధరల పట్టిక కచ్చితంగా ప్రదర్శించాలి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాలు

నూజివీడు టౌన్ : పట్టణంలోని రైతు బజారులో కూరగాయలను అధిక ధరలకు విక్రయిస్తే ఉపేక్షించబోమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి హెచ్చరించారు. రైతు బజారులో ప్రభుత్వం నిర్ణయించిన ధరకన్నా అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నట్లు కొంతమంది వినియోగదారులు మంత్రి పార్థసారధి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే రైతుబజారు అధికారులకు ఫోన్ చేశారు. పేద, సామాన్య ప్రజలకు కూరగాయల ధరలు అందుబాటులో ఉండాలని, ధరలు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు బజారులు ఏర్పాటు చేసిందన్నారు. అటువంటి రైతుబజారులో తమకు నచ్చినట్లు అధిక ధరలు వసూలు చేస్తే అధికారులపై, కూరగాయల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. రైతు బజారులో అధిక ధరలు వసూలు చేస్తే సంబంధిత విక్రయదారుల లైసెన్సును రద్దు చేస్తామన్నారు. ప్రతి రోజు నిర్ణయించిన ధరలకు విక్రయదారులు అమ్ముతున్నదీ లేనిదీ సంబంధిత రైతు బజారు ఎస్టేట్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రైతు బజారులో ప్రతిరోజు ధరల పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నూజివీడులో నేడు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నూజివీడులో ఈ నెల 20వ తేదీ శుక్రవారం నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆడిటోరియంలో ప్రభుత్వపరంగా నిర్వహించే మెగా జాబ్‌మేళాను నియోజకవర్గంలోని ప్రతి నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ లింక్ naipunyam.ap.gov.inలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో ప్రముఖ బహుళ జాతి కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ జాబ్ మేళాకు పదో తరగతి, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులందరూ పాల్గొని వారి జీవితానికి బంగారు భవిష్యత్తు బాటలు వేసుకోవాలని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో రానున్న ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ కల్పనలో భాగంగా ఈ మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. జాబ్ మేళాను విజయవంతం చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులు, ట్రిపుల్ ఐటి, సిబ్బంది, నాయకులందరూ కలిసి సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

ముసునూరు : నూజివీడు ట్రిపుల్ ఐటిలో ఈ నెల 20వ తేదీ శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు 20 పెద్ద కంపెనీలు ఆధ్వర్యంలో పదో తరగతి నుంచి డిగ్రీ ఆపై చదివిన విద్యార్థులకు కూడా ఈ మెగా జాబ్‌మేళాలో పాల్గొనాలని, మండలంలోని 16 గ్రామాల నిరుద్యోగ యువత విద్యావంతులు, నిరక్షరాస్యులు హాజరు కావాలని తెలిపారు.

వికలాంగుల పట్ల మానవత్వం కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వికలాంగుల పట్ల మానవత్వాన్ని చూపి మన పరిధిలో వారికి సహాయం చేయాలని జిల్లా అదనపు ఎస్పి నక్క సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని వట్లూరు ప్రాంతంలో ఉన్న ఆర్‌సిఎం ఆధ్వర్యంలో నిర్వహించే కరుణాలయ చర్చిలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పి నక్క సూర్యచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వికలాంగులకు ఆయన ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల సతీష్, ముల్లపూడి సాంబశివరావు, వట్లూరు సర్పంచి గుజ్జుల రత్నకుమారి, స్థానిక చర్చి ఫాదర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యాంగుకు వినతిపత్రం అందిస్తున్న జయలక్ష్మి, అప్పారావు

శానిటేషన్ వర్కర్ల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రభుత్వ పాఠశాలలో శానిటేషన్ వర్కర్లకు మూడు నెలలుగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.విజయలక్ష్మి కోరారు. ఉంగుటూరు ఎంఇఒ కార్యాలయంలో డివైఇఒ నిమ్మగడ్డ రవీంద్రభారతికి గురువారం వినతిపత్రం అందించారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించి వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. మాస్కులు, గ్లౌజులు, చీపుర్లు, మగ్గులు, డస్ట్‌బిన్లు ఇవ్వాలని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, మండల నాయకుడు సీరా అప్పారావు డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కె.రత్నమాల, కె.నాంచారమ్మ, ఎం.ముత్యాలు, వెంకటలక్ష్మి, బి.లక్ష్మి పాల్గొన్నారు.

కల్లాల్లో ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలో వరి పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒకపక్క రైతులు కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో ఉన్నారు. తుపాను ప్రభావం కారణంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేసేందుకు కుక్కునూరు మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయ సహాయ సంచాలకులు, కెఆర్.పురం, పిజి.బుజ్జిబాబు, కుక్కునూరు తహశీల్దార్ కె.రమేష్‌బాబు, కుక్కునూరు మండల వ్యవసాయాధికారి, ఆర్.బాలాజీతో కలిసి మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఆరబోసిన ధాన్యం కల్లాలను పరిశీలించారు. తుపాను ప్రభావంతో మండలంలో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఆరబెట్టిన ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తగా ఎత్తైన, నీరు నిలవని ప్రదేశంలో ఉంచి టార్పలిన్‌తో కప్పుకోవాలని, పంట కోతలను ఈ రెండు రోజులు విరమించుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం మండలంలోని శ్రీధర వేలేరు, తొండిపాక, చీరవల్లి, కుక్కునూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కనీస మద్దతు ధర కంటే ఎక్కువ వస్తే బయట అమ్ముకోవచ్చుని, ఒకవేళ రాని పక్షంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు.

నేరాలు - ఘోరాలు

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాల ప్రకారం... పెరవలి మండలం ఖండవల్లి గ్రామం వద్ద గత నెల నవంబర్ 22వ తేదీ రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో నరేష్ (55) అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. అటుగా వెళ్తున్న వారు 108 అంబులెన్సులో తణుకు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎంఎల్‌సిగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సంతానం కలగలేదని...

వివాహమై ఏడేళ్లు అయినప్పటికీ సంతానం కలగలేదని తీవ్ర మనస్తాపానికి గురైన ఒక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ మండలం బూరాయిగూడేనికి చెందిన కాటి కిషోర్(25)కు మౌనికకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఏడేళ్లైన సంతానం కలగలేదని మానస్తాపానికి గురైన కిషోర్ ఈ నెల 17వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతగు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎంఎల్‌సిగా నమోదు చేసి ఆసుపత్రి ఔటపోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

గుర్తు తెలీని వాహనం ఢీకొని...

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బీహార్ వాసి పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. బీహార్‌కు చెందిన కొంతమంది లింగపాలెం మండలం రంగాపురంలో పనుల నిమిత్తం వచ్చారు. వారిలో సోనూకుమార్ (20) అనే యువకుడు మరో వ్యక్తితో కలిసి బైక్‌పై ఈ నెల 18వ తేదీ సాయంత్రం ఏలూరు బయలుదేరారు. ఈ క్రమంలో రంగాపురంలో గుర్తు తెలీని వాహనం వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సోనుకుమార్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటినుంచి అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎంఎల్‌సిగా నమోదు చేసి ఆసుపత్రి ఔటపోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

వాతావరణ మార్పులతో ఆక్వా రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ముదినేపల్లి

అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో వచ్చిన మార్పులతో ఆక్వా రైతులు బెంబేలెత్తుతున్నారు. ఎండ, వర్షం, వాతావరణం చల్లబడడం, చల్లని గాలులు వీయడంతో రొయ్యల చెరువుల్లో వైరస్ సమస్య తలెత్తుతుంది. దీంతో రొయ్యలకు ప్రాణవాయువు అందక మృత్యువాత పడే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు చెబుతున్నారు. దీంతో చెరువుల్లో ఆక్సిజన్ స్థాయిని పెంచేందుకు నిరంతరం ఏరియేటర్లు తిప్పుతున్నారు. మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. పలు గ్రామాల్లో చెరువుల్లో రొయ్యలు వంద కౌంట్ దశలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వాతావరణంలో మార్పులు రావడంతో చేతికి పంట వస్తుందో రాదో అనే ఆందోళనలో ఆక్వా రైతులు ఉన్నారు. వైరస్‌ను నిరోధించేందుకు అదనంగా చాలా ఖర్చు చేయాల్సి వస్తుందని ఆక్వా రైతులు చెబుతున్నారు. మరోవైపు వాతావరణ మార్పులతో వరి రైతులు కలవరపడుతున్నారు. అల్పపీడన ప్రభావంతో మండలవ్యాప్తంగా నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై తరచూ మోస్తరు వర్షం పడడంతో రైతులు పంటను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. పలు గ్రామాల్లో పంటను కోసి ధాన్యాన్ని కల్లాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఆరబెట్టుకున్నారు. వర్షం సూచనలతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.



రొయ్యల చెరువులో తిప్పుతున్న ఏరియేటర్లు

మండలంలో ఇప్పటికే 80 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. చివరి దశలో మాసూళ్లు చేపడుతున్న రైతులు వాతావరణ మార్పులతో ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని హడావిడిగా ఇళ్లకు, మిల్లులకు తరలిస్తున్నారు. కోత కోసి పొలాల్లో ఉన్న వరి పనులు కుప్పలుగా వేస్తున్నారు. పండిన పంట ఇంటికి వచ్చే సమయంలో వర్షాలు ప్రారంభం కావడంతో మండలంలోని వరి రైతులు ఆవేదన చెందుతున్నారు.

మంగళిమెట్ట గిరిజనులకు పట్టాలివ్వాలి

రెవెన్యూ సదస్సులో సిపిఎం వినతి

ప్రజాశక్తి - టి.నర్సాపురం

రామమ్మగూడెం మంగళిమెట్ట భూములు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గూడెల్లి వెంకట్రావు, సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం మండలంలోని ఎపిగుంటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ సాయిబాబాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకట్రావు, సుధారాణి మాట్లాడుతూ మండలంలోని ఎపిగుంట రెవెన్యూ పరిధిలో ఉన్న మంగళిమెట్ట భూమి 38 ఎకరాల్లో గిరిజనులు గత 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. సాగు పట్టాలు ఇవ్వాలని గిరిజనులు పోరాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొందరు భూస్వాములకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, వెంటనే వాటిని ఆపాలని డిమాండ్ చేశారు. గత 60 ఏళ్లకు పైగా సాగులో ఉన్న గిరిజనులకు రెవెన్యూ రికార్డుల అడంగల్‌లోకి ఎక్కించి పట్టాల మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడకం శ్రీను, మడకం రాము, కె.బాబూరావు పాల్గొన్నారు.

ముసునూరు : భూ సమస్యలు ఉన్న ప్రతి రైతు గ్రామ రెవెన్యూ సదస్సులో ఆ సమస్యలను పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శర్మ అన్నారు. మండలంలోని వేల్పుచర్ల గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నమోదు, వన్‌బి, ఆర్‌ఒఆర్, రీ సర్వే ఇలా తప్పులు తడకగా వచ్చిన రైతు సమస్యలను పరిష్కరించే విధంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేల్పుచర్లలో ఎనిమిది మంది రైతులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కలిదిండి : గతంలో రిజిస్ట్రేషన్ అయ్యి ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యలపై రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు అధ్యక్షతన మండల స్థాయి రైతు సదస్సు నిర్వహించారు. 22 ఎ భూములు, మిలటరీ భూములపై సమస్యలు వెల్లువెత్తాయి. గత ప్రభుత్వ విధానాలతో జరిగిన తప్పులను, ప్రస్తుత ప్రభుత్వంలో సరిదిద్ది రైతాంగానికి అండగా ఉంటామన్నారు. ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాలను రైతులు అందించారు.



టి.నరసాపురం : వినతి అందిస్తున్న సిపిఎం నేతలు

కుక్కునూరు : మండలంలో తొండిపాక గ్రామంలో మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో భాగంగా గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామంలో రైతులు వారి భూమి హక్కు, పేరు మార్పు సమస్యలు, విక్రయం మ్యూటేషన్, భూ విస్తీర్ణంలో తేడాలు తదితర అంశాలపై వినతిపత్రం అందించారు. కుక్కునూరు మండలంలో గత ఏడేళ్ల నుంచి వెబ్ ల్యాండ్ నిలిపివేయడం వల్ల ప్రస్తుతం కూడా ఎటువంటి చేర్పులు, మార్పులు జరగవని తెలుసుకుని రైతులు నిరాశ చెందారు. స్థానిక తహశీల్దార్ కె.రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఇక్కడ ఉన్న వెబ్ ల్యాండ్ సమస్యను, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ప్రత్యేక అధికారి జి.బుజ్జిబాబు, వ్యవసాయాధికారి బాలాజీ, మండల సర్వేయర్ మధుసుదన్, స్థానిక సర్పంచి గడ్డ రాజేశ్వరి, ఎంపిటిసి సభ్యులు వంక రమణ, జనసేన పార్టీ మండలాధ్యక్షులు ములిశెట్టి యుగంధర్, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, వెంకన్నబాబు, తాండ్ర రవిప్రసాద్, నూకల వినోద్ పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం సత్యసాయి సంస్థ ఉద్యోగుల జీతాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు కోరారు. ఈ మేరకు ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్విని గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. సత్యసాయి నీటి సంస్థ ఉద్యోగులకు మూడు నెలల నుంచి జీతాలు బకాయిలుగా ఉండడంతో ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బకాయి జీతాలు విడుదల చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ అంశంపై కలెక్టర్ వెట్రిసెల్వి సానుకూలంగా స్పందించి వెంటనే జీతా బకాయాలను విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన సంక్షేమ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సుదూర ప్రాంతంలోని చిత్తూరు, కడప, కర్నూలు, జిల్లాల్లో కెఆర్.పురం నుంచి ఉపాధ్యాయులు, సిఆర్టీలను డిప్యూటేషన్ వేయడంతో సదరు ఉత్తర్వులను నిలుపుదల చేయడం గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ వెట్రిసెల్వి సానుకూలంగా స్పందించారు. అనంతరం నియోజవర్గంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ల 33/11 కెవి సామర్థ్యపు విద్యుత్ ఉప కేంద్రంలో ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అంబేద్కర్ తెలిపారు. దీనిలో భాగంగా 11 కెవి సామర్థ్యపు లైన్లు ఉన్న దుద్దేపూడి, పూళ్ళ, కురెళ్లగూడెం, ఎంఎం.పురం, పారిశ్రామిక ఫీడర్ ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టనున్నామని తెలిపారు. ఈ కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దుద్దేపూడి, అన్నేవారిగూడెం, కురెళ్లగూడెం, కోడూరుపాడు, ఎంఎం.పురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఏర్పడతాయని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంధనం ఆదాపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జాతీయ ఇంధనా వారోత్సవాల సందర్భంగా నూజివీడు విద్యుత్ శాఖ ఉద్యోగులు గురువారం ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా కార్యాలయం వద్ద నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇఇ ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ భావితరాలకు విద్యుత్ కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సౌరశక్తిని విద్యుత్ శక్తిగా వినియోగించుకోవాలన్నారు. నేటి సత్ సంకల్పం రేపటి వెలుగుకు సహకారం అవుతుందన్నారు. విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా అవుతుందన్నారు. ఇంధన పరిరక్షణ కోసం ఎల్ఇడి బల్బులు, ఎక్కువ స్టార్లు ఉన్న గృహోపకరణాలు వాడాలన్నారు. కరెంటు హీటర్లు, గ్రీజర్లు, బదులు సోలార్ పరికరాలను వాడాలన్నారు. దీనివల్ల 30 శాతం విద్యుత్ ఆదా అవుతుందని, తద్వారా కాలుష్యాన్ని కూడా నివారించగలమని అన్నారు. ప్రతిఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేసి భావితరాలకు భరోసా కల్పించాలన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడేవిధంగా ప్రజలకు ఈ వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఇలు దుర్గారావు, పోతురాజు, ఎఇలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడంపై పోస్టర్ ప్రజెంటేషన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నవంబర్ 25 నుంచి ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహిస్తున్న నేషనల్ జెండర్ క్యాంపెయిన్ నయి చేతన 3.0లో భాగంగా మూడో వారం గురువారం బాల్య వివాహాలను అరికట్టడం అంశంపై పోస్టర్ ప్రెజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు అధ్యక్షత వహించారు. విద్యార్థులు సంబంధిత అంశంపై పోస్టర్లను ప్రజెంట్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్త టివిఎస్.పద్మావతి, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు ఎస్.సుశ్మలత, డి.సుజాత, గణిత శాస్త్ర అధ్యాపకులు కావ్యశ్రీ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

అందరూ బాధ్యతగా పని చేయాలి

కారాగారాన్ని పరిశీలించిన ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ప్రజాశక్తి - చింతలపూడి

అందరూ బాధ్యతగా పని చేయాలని ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. పట్టణంలో కారాగారాన్ని ఆయన గురువారం పర్యవేక్షించి నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలు, తదితర విషయాలు నిందితులను అడిగి తెలుసుకున్నారు. నిందితులకు అందించే ఉచిత న్యాయ సలహాల సహాయంపై ఆరా తీశారు. అందరూ బాధ్యతగా పనిచేయాలని చెప్పారు. వంటశాల స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప కారాగార పర్యవేక్షణ అధికారి కృపానందం, జైలు సిబ్బంది పాల్గొన్నారు.



భోజనం రుచి చూస్తున్న రత్నప్రసాద్

గణిచర్లలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ స్వతంత్ర సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా తన పరిపాలన దక్షతతో అఖండ భారతావనికి విశేష సేవలందించారని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని గణిచర్ల గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పేదల ప్రేమాభిమానాలు పొందిన వ్యక్తి అని గుర్తు చేశారు. బడుగు బలహీన తరగతుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని అన్నారు. దేశంలోని దళిత, బహుజనుల బాగు కోసం బాబూ జగ్జీవన్‌రామ్ ఎనలేని కృషి చేశారన్నారు. జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య, మండలాధ్యక్షులు చిదరాల మధుబాబు, రాజారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - భీమడోలు

విద్యావ్యాప్తికి, పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. గుండుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.7.60 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 40 కెవి సామర్థ్యం ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఆయన గతంలో పాఠశాలను సందర్శించిన సందర్భంగా పాఠశాల యాజమాన్యంతో పాటు, పరిసరాల్లో ఉన్న నివాస గృహాలు, ఇతర కనెక్షన్ల గల పలువురు విద్యుత్ వినియోగదారులు స్థానికంగా ఉన్న 15 కెవి సామర్థ్యం ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల తాము నిత్యం లో ఓల్టేజ్‌తో ఇబ్బంది పడుతున్నామని ఆయన దృష్టికి తెచ్చారు. ఇదే నేపథ్యంలో పాఠశాల, జూనియర్ కాలేజీ యాజమాన్యం లో ఓల్టేజ్ కారణంగా పాఠశాలకు చెందిన పలు విద్యుత్ పరికరాలు పనిచేయడం లేదని, వాటి సేవలు విద్యార్థులకు అందడం లేదని తెలిపారు. విద్యార్థులకు వాటి సేవలు ఉండటం తప్పనిసరని ఆయనకు తెలిపారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ ట్రాన్స్ కో అధికారులతో సమస్య పరిష్కారానికి చర్చించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తక్కువ సామర్థ్యం ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో అత్యధిక సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌పార్మర్ ఏర్పటుతో పాటు, దానికి అనుబంధంగా ఉండే కండక్టర్లను మార్పిడి చేయాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన ట్రాన్స్ కో అధికారులు యుద్ధ ప్రాతిపదికన దానిని అమర్చారు. దానిని ఎంఎల్ఎ గురువారం ప్రారంభించారు. లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి సహకరించిన ఎంఎల్ఎకు పాఠశాల యాజమాన్యంతో పాటు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ధర్మరాజు

ఐదేళ్ల లీజును తక్షణం చెల్లించాలి

మాజీ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి ఎదుట ధర్నా

ప్రజాశక్తి - దెందులూరు

కొల్లేరు లంక గ్రామాల ప్రజలు తవ్వుకున్న చేపల చెరువుల గత ఐదేళ్ల లీజులు మాజీ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి తక్షణం చెల్లించాలని కృష్ణా, గోదావరి కొల్లేరు మత్స్య సంఘం అధ్యక్షులు సైదు సత్యనారాయణ డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రాంతంలో లంక గ్రామాల ప్రజలకు చెందిన చేపల చెరువుల గత ఐదేళ్ల లీజులను తక్షణం చెల్లించాలని కోరుతూ శ్రీపర్రు గ్రామానికి చెందిన వందలాది మంది ప్రజలు, మహిళలు గురువారం పెదవేగి మండలంలోని కొండలరావుపాలెంలో మాజీ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు సంఘీభావం తెలిపిన సైదు సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ 2019లో కొల్లేరులంక ప్రజల విజ్ఞప్తి మేరకు అప్పటి ఎంఎల్ఎగా ఉన్న చింతమనేని ప్రభాకర్ సుమారు రూ.మూడు కోట్లు వెచ్చించి శ్రీపర్రు, కోమటిలంక గ్రామాలకు చెందిన చేపల చేరువులను తవ్వించినట్లు తెలిపారు. ఆ వెనువెంటనే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ చెరువులను అప్పటి ఎంఎల్ఎగా గెలుపొందిన కొఠారు అబ్బయ్య చౌదరి దౌర్జన్యంగా లాగేసుకున్నారన్నారు. ఐదేళ్ల పాటు చెరువులను సాగు చేసిన ఆయన పేద ప్రజలకు లీజులు కూడా చెల్లించకుండా వారి పొట్ట కొట్టారన్నారు. ఆవేకాకుండా అప్పట్లో చింతమనేని ప్రభాకర్ తవ్వించిన, సాగులో ఉన్న సోమవరప్పాడు చెరువులను అక్రమంగా పట్టేసుకుని రూ.కోట్లలో సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. అప్పట్లో నోరు విప్పనీయకుండా అణచివేయడంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక కష్ట నష్టాలు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారిన దరిమిలా గత ఐదేళ్ల లీజులను ఇవ్వాలని శ్రీపర్రు గ్రామానికి చెందిన మహిళలు, ప్రజలు కొండలరావుపాలెంలోని మాజీ ఎంఎల్ఎ కోటారు అబ్బయ్య చౌదరి ఇంటి ముందు నాలుగు రోజులుగా ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం, కలెక్టర్, ఇతర పెద్దలు స్పందించి పేద ప్రజలకు రావాల్సిన లీజులను మాజీ ఎమ్మెల్యే తక్షణం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారీ ఎత్తున ఆందోళన చేపడతా మని హెచ్చరించారు. గ్రామానికి చెందిన వెంకట సుబ్బలక్ష్మి మాట్లాడుతూ... గత ఐదేళ్లుగా మా గ్రామస్థులు తీవ్ర వంచనకు గురయ్యామని, ఇప్పుడైనా మాకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం మా బాధను అర్థం చేసుకుని మాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏలూరు మండల నాయకులు నేతల రవి, నంబూరి నాగరాజు, కొల్లేరు సంఘ నాయకులు, గ్రామ పెద్దలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా పోలీసు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలకు ఎస్పి ప్రతాప్‌శివకిషోర్ రంగం సిద్ధం చేశారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందికి పోలీసు యూనిట్లో పని చేస్తున్న సిబ్బందికి పోలీసు ఆసుపత్రిలో ఉచిత వైద్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 17 రకాల వైద్య పరీక్షలను సిబ్బందికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఆర్ ఆర్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ సిబ్బందికి ప్రత్యేక వైద్య పరీక్షలను నిర్వహించామని తెలిపారు. ఈ 17 రకాల వైద్య పరీక్షలు అరుదైనవని చెప్పారు. సిబ్బంది సంక్షేమం లక్ష్యంగా ఎస్పి పని చేస్తున్నారన్నారు. ఆయన ఆదేశాల మేరకే ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో గత రెండు వారాలుగా సత్యసాయి మంచినీటి సరఫరా నిలిచిపోయి ప్రజానీకం తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సత్యసాయి మంచినీటి కార్మికులు పైపులైన్ల మరమ్మతులు ప్రారంభించారు. యడ్లగూడెం కల్వర్టు సమీపంలో బోదెలోకి నీటి అడుగున ఉన్న పైపులైను రంధ్రం పడి నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయంగా అక్కడి పైపులైన్లను కట్ చేసి కొత్త పైపులు వేసి నీటి సరఫరా పునరుద్ధరించే పనులను ప్రారంభించారు. మరో నాలుగు రోజుల్లో నీటి సరఫరా పునరుద్ధరించనున్నట్లు కార్మికులు తెలిపారు.

ముగిసిన షష్ఠి ఉత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న షష్ఠి కళ్యాణోత్సవాలు బుధవారం నిర్వహించిన అఖండ అన్న సమారాధనతో ఘనంగా ముగిశాయి. 13 రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యాత్రికులు తరలివచ్చి పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాలు ముగియడంతో గురువారం ఆలయ హుండీలను అధికారులు లెక్కించారు. 70 రోజులకు రూ.21,26,565, అన్నదానం హుండీ తెరచి లెక్కించగా రూ.78,951 కలిసి మొత్తం రూ.22,05,516 నగదు, బంగారం 20 గ్రాములు, వెండి 850 గ్రాములు స్వామివారికి ఆదాయంగా వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్.గంగాశ్రీదేవి తెలిపారు. హుండీల లెక్కింపులో సేవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. హుండీల లెక్కింపునకు పర్యవేక్షణ అధికారిగా గుడివాడ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరిపురం సర్పంచి, పరసా విశ్వేశ్వరరావు, షష్ఠి ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, వేనిగళ్ల సురేష్, పరసా కృష్ణ, బూరుబోయిన సోవమ్మ, కొట్టి సుబ్బ లక్ష్మి, దగాని నాగలక్ష్మి, బెజవాడ నాగవెంకట రాధాకృష్ణ, పరసా రమేష్, విఆర్‌ఒలు రామసుబ్బయ్య, ఏడుకొండలు పాల్గొన్నారు.

'సిపిఐ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలి'

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. 99 ఏళ్ల పూర్తి చేసుకుని వందో సంవత్సరంలోకి అడుగుపెడుతుందని తెలిపారు. వేలేరుపాడు సిపిఐ కార్యాలయంలో పిట్టా ప్రసాద్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ సిపిఐ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. అనంతరం నాయకులతో కలిసి కమ్యూనిజం పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, నాయకులు పిట్టా వీరయ్య, కురిమేళ్ల వెంకటేశ్వరరావు, కరటం వెంకటేశ్వరరావు, బంధం నాగేశ్వరరావు, మడివి కామయ్య పాల్గొన్నారు.